క్లుప్తంగా

గుంతల పూడ్చివేత



సాక్షి ఎఫెక్ట్..

పెద్దవంగర: మండలంలోని కిష్టు తండా, బీసీ తండా, ఎల్‌బీ తండా మీదుగా వెళ్లే జాతీయ రహదారిపై ఏర్పడిన లోతైన గుంతలను ఎట్టకేలకు అధికారులు పూడ్చారు. 'రోడ్లు ఇలా.. ప్రయాణం ఎలా' శీర్షికన 'సాక్షి'లో శనివారం కథనం వెలువడింది. దానికి స్పందించిన ఎస్సై పిల్లల రాజు ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి దగ్గరుండి రహదారిపై గుంతలను పూడ్చివేయించారు. 'సాక్షి' పత్రిక కథనంతో పోలీసులు స్పందించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్మీ శిక్షణ శిబిరం

తొర్రూరు: వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో తొర్రూరులో నిర్వహించే ఉచిత ఆర్మీ శిక్షణ శిబిరాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని సంస్థ డైరెక్టర్ తక్కెళ్లపల్లి రవీంద్ర తెలిపారు. శనివారం డివిజన్ కేంద్రంలో శిక్షణ శిబిర వివరాలు వెల్లడించారు. 2023 ఆర్మీ ప్రవేశ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు 45రోజుల పాటు తొర్రూరులోని నితిన్ భవన్‌లో ఉచిత భోజన వసతితో కూడిన శిక్షణ అందిస్తామని తెలిపారు. కల్నల్ డాక్టర్ శ్రీనివాసరావు నేతృత్వంలో విశ్రాంత సైనికులతో అగ్నివీర్ ఆర్మీ శిక్షణ శిబిరం నిర్వహిస్తామన్నారు. శిక్షణా శిబిరం ఆగస్టు 8 నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తొర్రూరులోని నితిన్‌భవన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 9177148158, 8074357700 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కొనసాగుతున్న సమ్మె



సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం నాటికి 17వ రోజుకు చేరుకుంది. సమ్మెకు పలు సంఘాల, పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. జిల్లా కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జీపీ సిబ్బంది కొనసాగిస్తున్న సమ్మెకు మాజీ కేంద్ర మంత్రి బలరాంనాయక్ శనివారం మద్దతు తెలిపారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్న కార్మికులను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాధ్యం

నెల్లికుదురు: పేదోడి సొంతింటి కల నెరవేర్చేది కాంగ్రెస్ పార్టీ అని, పార్టీని ఆదరించాలని పార్టీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ మురళీ నాయక్ ప్రజలను కోరారు. శనివారం మండలంలోని మేచరాజుపల్లి, పెద్దతండా గ్రామాలల్లో పార్టీ నాయకులతో ప్రచారం చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని సత్యపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు వెలిశాల లక్ష్మీ దేవేందర్‌రావు, నాయకులు దేవేందర్‌రావు, దేవేందర్‌రెడ్డి, బాలాజి నాయక్ పాల్గొన్నారు.

డ్రైవర్‌గా మారిన సర్పంచ్



గూడూరు: గ్రామ పంచాయతీ సిబ్బంది సమ్మెలో ఉండగా, పారిశుద్ధ్య పనులు చేసే వారు లేక సొంతంగా కూలీలను పెట్టి వీధుల్లో చెత్తాచెదారం శుభ్రం చేయిస్తూ, సర్పంచ్ ట్రాక్టర్ డ్రైవర్‌గా మారాడు. ఈ సంఘటన మండలంలోని జగన్నాయకులగూడెంలో శనివారం నెలకొంది.

మానవత్వానికి మాయని మచ్చ

- మణిపూర్ ఘటనపై వెల్లువెత్తిన నిరసనలు

మహబూబాబాద్ అర్బన్: మణిపూర్ రాష్ట్రంలో మహిళలను నగ్నంగా ఊరేగించి, సామూహిక అత్యాచారం, హత్యలకు పాల్పడం మానవత్వానికి మాయని మచ్చ అని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కవిత అన్నారు. టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం, పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైస శ్రీనివాస్, జిల్లా బాధ్యులు రమేష్, విష్ణువర్ధన్, ఉపేందర్, సువర్ణ, వసంత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బయ్యారం: మణిపూర్‌లో గిరిజన మహిళలపై జరిగిన సామూహిక లైంగికదాడిని నిరసిస్తూ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం బయ్యారంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నునావత్ రాధ, ఎంపీటీసీ మోహన్‌జీ, సర్పంచ్ భాస్కర్, పాల్గొన్నారు.

తొర్రూరు: మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని, మహిళలకు రక్షణ కల్పించాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం డివిజన్ కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, ఐలయ్య, హేమాద్రి పాల్గొన్నారు.

కేసముద్రం: మణిపూర్ ఘటన కారకుల్ని కఠినంగా శిక్షించాలని సీపీఎం మండల కార్యదర్శి మోడెం వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చాగంటి కిషన్, జల్లె జయరాజ్, ఉప్పలయ్య, వెంకన్న పాల్గొన్నారు.



మహబూబాబాద్ అర్బన్: ర్యాలీ నిర్వహించి మాట్లాడుతున్న కవిత



తొర్రూరు: ర్యాలీ నిర్వహిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

నెహ్రూసెంటర్: మణిపూర్ రాష్ట్రంలో కుకి ఆదివాసీ మహిళలపై జరిగిన సంఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మనబోయిన అనసూర్య డిమాండ్ చేశారు. మహిళలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వివేకానంద సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సామ రజిత, సునీత, కల్యాణి పాల్గొన్నారు. దేశంలో మహిళలకు రక్షణ కరువైందని ఎంఆర్‌పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండ్ర ఎల్లయ్య అన్నారు. మణిపూర్‌లో జరిగిన సంఘటనకు అక్కడి ప్రభుత్వమే బాధ్యత వహించాలని పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి ఊకే పద్మ అన్నారు.

గార్ల: మణిపూర్‌లో గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించిన నిందితులను కఠినంగా శిక్షించాలంటూ శనివారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గార్లలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాసరావు, గిరిప్రసాద్, గోవింద్, వీరస్వామి, పాల్గొన్నారు. నిందితులను శిక్షించడంలో మణిపూర్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా నాయకులు సక్రు ఆరోపించారు.



నెహ్రూసెంటర్: కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



బయ్యారం: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

పేదలపై భారం మోపడం సరికాదు

మహబూబాబాద్: జీఓ 59 పేరుతో పేదలపై ఆర్థిక భారం మోపడం సరికాదని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులో శనివారం జీఓ 59పై రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. ఈ సందర్భంగా అజయ్‌సారథి రెడ్డి మాట్లాడుతూ.. కొండపల్లిగోపాల్‌రావు నగర్ కాలనీతో పాటు పలు కాలనీలలో కొంత మందిపై రూ.15లక్షల నుంచి రూ.18లక్షల భారం పడిందన్నారు. ఆ ఇళ్లు అమ్మినా అన్ని డబ్బులు రావని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం పునరాలోచించి నామమాత్రపు డబ్బులు చెల్లించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, సాంబలక్ష్మి, మేక వీరన్న, పాల్, శ్యామ్ పాల్గొన్నారు



సర్వే బృందానికి వివరిస్తున్న అజయ్‌సారథి రెడ్డి

పారదర్శకంగా అమలు చేయాలి



మాట్లాడుతున్న రామ్మూర్తి

నెహ్రూసెంటర్: రాజకీయాలకతీతంగా దళితబంధు పథకాన్ని పారదర్శకంగా అమలు చేసి అర్హులందరికీ వర్తింపజేయాలని సీపీఎం మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి అన్నారు. కుల వివక్ష పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో సంఘ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రెండో విడతలో అవకతవకలు జరగకుండా నిజమైన లబ్ధిదారులను పథకం అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దుప్పెల్లి అనిల్‌కుమార్, దర్శనం రామకృష్ణ, తిప్పర్తి శ్రీధర్, నీరుడు సామేల్, వీరస్వామి, కుర్ర మహేష్, వీరయ్య, చిరంజీవి పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవి తిరునక్షత్ర ఉత్సవం

మహబూబాబాద్ రూరల్: గోదాదేవి అమ్మవారి తిరునక్షత్రం (జన్మదినోత్సవం) సందర్భంగా జిల్లా కేంద్రంలోని శ్రీవేణుగోపాల స్వామివారి దేవాలయంలో శనివారం తిరునక్షత్ర ఉత్సవం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై లక్ష్మినారాయణ చార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, సేవాకాలం, కుంకుమార్చనలు జరిపారు. అనంతరం తీర్థ గోష్టి ఏర్పాటు చేసి 27 నక్షత్రాలకు సంబంధించిన మొక్కలు నాటారు.

గూడూరు: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో శనివారం గోదా ఆండాల్ దేవి తిరునక్షత్ర పూజలను ఆలయ పూజారి వేణుగోపాలస్వామి వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు నరేష్, భాస్కర్, నరేష్ ఏర్పాట్లు చేశారు.



మహబూబాబాద్ రూరల్: పూజలు చేస్తున్న అర్చకులు

బర్తరఫ్ చేయాలి

తొర్రూరు: మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలమైన మణిపూర్ ప్రభుత్వాన్ని వెంటనే బర్తరఫ్ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్ అన్నారు. డివిజన్ కేంద్రంలో శనివారం సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మండల కార్యదర్శి ఎండీ యాకూబ్, పట్టణ కార్యదర్శి జమ్ముల శ్రీను, నాయకులు సాంబయ్య, సోమిరెడ్డి పాల్గొన్నారు.

నిల్వనీరు పంట పొలాలకు తరలింపు

గూడూరు: మండలంలోని భూపతిపేటలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వీధుల్లో నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతున్నాయి. విషయం తెల్సుకున్న తహసీల్దార్ అశోక్‌కుమార్ భూపతిపేట సర్పంచ్ ఆవుల కవిత అశోక్‌యాదవ్‌తో కలిసి జేసీబీ సహకారంతో కాల్వలు తీసి పంట పొలాల వైపు తరలించారు. దీంతో వీధి వాసులు ఊపిరి పీల్చుకున్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్

నర్సింహులపేట: పేదల సంక్షేమం కోసమే బీఆర్‌ఎస్ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి హాజరై మాట్లాడారు. అధికారులు ప్రజలకు ఇబ్బంది కలగకుండా పని చేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు రాకుండా గ్రామాల్లో పర్యవేక్షన చేస్తు వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులకు ధాన్యం డబ్బులు రాకుంటే వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో విద్యుత్, నీటి సమస్య రాకుండా చూడాలన్నారు. వస్త్రాతండా పరిధిలో 36 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం జయపురం గ్రామంలో దర్గాను సందర్శించి ముస్లింలతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ టేకుల సుశీల, జెడ్పీటీసీ భూక్య సంగీత, వైస్ ఎంపీపీ దేవేందర్, తహసీల్దార్ జి.వివేక్, ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, ఏఓ సాజిద్, ఏఈలు నర్సింగ్ నాయక్, వెంకటేశ్వరరెడ్డి, పాండునాయక్, సీడీపీఓ శిరీష, ఎంపీఓ సోమ్‌లాల్ పాల్గొన్నారు.

సభనుంచి కాంగ్రెస్ వాకౌట్

మండల కేంద్రంలో సర్వసభ్య సమావేశంలో కాంగ్రెస్ సభ్యులు వాకౌట్ చేశారు. ధాన్యం కొనుగోలు చేసిన రైతులకు డబ్బులు రాలేదని, పింఛన్ కట్ చేస్తున్నారని అధికారులు సమాధానం చెప్పిన తర్వాతే సభను నడిపించాలని పెద్దనాగారం సర్పంచ్ బొబ్బ సామిరెడ్డి, నర్సింహులపేట ఎంపీటీసీ సభ్యురాలు జినుకల అనురాధ నాయకులతో గొడవపడ్డారు. దీంతో బీఆర్‌ఎస్ సభ్యులకు, కాంగ్రెస్ సర్పంచ్‌కు వాగ్వాదం జరిగింది. కాంగ్రెస్ సభ్యులు వాకౌట్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సభ్యులు అధికారులు సమాధానం చెప్పే వరకు చూడాలని, సమాధానం చెప్పేలోపే గొడవచేయడం సరికాదన్నారు. సభలో ఎంపీటీసీలు సభ్యులు మాత్రమే అని, సర్పంచ్‌లు అతిథిలు మాత్రమే అని అన్నారు. ఇష్టానుసారంగా వ్యవరించడం సరికాదన్నారు.



ఇళ్ల స్థలాల పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే

అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లోకి..

చిన్నగూడూరు: సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. శనివారం మండలంలోని ఉగ్గంపల్లిలో డోర్నకల్ మండలం పెరుమాండ్లసంకీస గ్రామానికి చెందిన కాంగ్రెస్, సీపీఎం నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

క్రైం కార్నర్..

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

నెల్లికుదురు: పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని శ్రీరామగిరి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శ్రీరాగిరి గ్రామంలో నివాసముంటున్న ఆంగోతు మంగీలాల్ (45) కడుపు నొప్పి ఎక్కువ కావడంతో మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఇంటికి వచ్చాడు. రాత్రి 11గంటలకు భార్య భద్రమ్మకు పురుగుల మందు తాగినట్లు చెప్పాడు. కుటుంబ సభ్యులతో విషయం చెప్పి 108లో మహబూబాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. భద్రమ్మ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడులు

కురవి: మండలంలోని కాంపల్లి గ్రామంలో శనివారం ఓ ఇంట్లో పేకాట స్థావరంపై దాడి చేసి గ్రామానికి చెందిన వెంకన్న, వెంకట్రాములు, చంద్రయ్య, రాములు, వెంకన్నలపై కేసు నమోదు చేసినట్లు, వారి వద్ద నుంచి రూ.12వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రమాదేవి తెలిపారు.

రైలునుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

కేసముద్రం: రైల్లో నుంచి ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు జారి కిందపడిన సంఘటన మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరత్‌కి చెందిన వక్తల్ అనే వ్యక్తి, వరంగల్ నుంచి ఖమ్మం వైపునకు వెళ్లే రైల్లో ప్రయాణిస్తున్నాడు. ఈక్రమంలో కేసముద్రం రైల్వేస్టేషన్ సమీపంలో(డౌన్‌లైన్) ఫుట్‌ డోర్ వద్ద ఉన్న అతడు కాలుజారడంతో కింద పడ్డాడు. దీంతో అతడి తలకు, నడుముభాగంలో తీవ్రగాయాలయ్యాయి. దీంతో అతన్ని 108లో మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఉరేసుకుని ఆత్మహత్య

డోర్నకల్: మండలంలోని చిలుకోడు గ్రామానికి చెందిన రాగం బక్కయ్య(55) శుక్రవారం రాత్రి మద్యం మత్తులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శ్యాంసుందర్ శనివారం తెలిపాడు. మృతుడి భార్య వెంకటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

నల్లబెల్లంతో వెళ్తున్న కారు పట్టివేత

గార్ల: నల్లబెల్లం లోడ్‌తో వెళ్తున్న కారును పోలీసులు పట్టుకొని కారును స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బానోత్ వెంకన్న శనివారం తెలిపారు. వివరాలిలావున్నాయి. డోర్నకల్ గ్రామానికి చెందిన సచిన్‌కు మారుతీ స్విఫ్ట్ కారులో 8క్వింటాళ్ల నల్లబెల్లం, 50 కేజీల పటిక లోడు చేసుకొని గార్ల మండలం ముల్కనూరు, చిన్నకిష్టాపురం గ్రామాలకు చెందిన కొమ్మనబోయిన సతీష్, భద్రులకు బెల్లంను అమ్మేందుకు వెళ్తుండగా చిన్నకిష్టాపురం గ్రామంలో పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కారును పట్టుకున్న హెడ్ కానిస్టేబుల్ బాలకృష్ణ, కానిస్టేబుల్ శ్రీనివాస్, హోంగార్డ్‌లు రాము, భద్రులను ఎస్సై అభినందించారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

మహబూబాబాద్ రూరల్ : ఆరోగ్యమే మహా భాగ్యమని రోటరీ క్లబ్ వ్యవస్థాపకులు మాలె నాగేశ్వరరావు అన్నారు. క్లబ్ మహబూబాబాద్ శాఖ ఆధ్వర్యంలో మార్వాడి సత్రంలో జూలై 16 నుంచి 21వరకు ఆరు రోజులపాటు జోధ్‌పూర్‌కు చెందిన ప్రముఖ థెరపిస్ట్ సత్యనారాయణ చౌదరి వారి బృందంతో నిర్వహించబడిన వైద్యశిబిరం ముగింపు సమావేశం శనివారం రాత్రి నిర్వహించారు. అనంతరం సత్యనారాయణ చౌదరి వారి సతీమణి జూయి చౌదరిని సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కొడారి నాగేంద్రరావు, జిల్లా బాధ్యులు వద్దుల సురేందర్ రెడ్డి, బిక్కి వెంకటేశ్వర్లు, కార్యదర్శి గూడూరు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపిక

గార్ల: ఇళ్లు లేని 40 మంది నిరుపేద లబ్ధిదారులను గ్రామసభలో గుర్తించినట్లు తహసీల్దార్ వీరన్న తెలిపారు. శనివారం గార్ల పంచాయతీ పూమ్యాతండాలో సర్పంచ్ అజ్మీర బన్సీలాల్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. పూమ్యాతండాలో ఒక ఎకరం ప్రభుత్వ భూమిని గుర్తించామన్నారు. ఇట్టి భూమిలో ఇళ్లు లేని ఒక్కో లబ్ధిదారుడికి 75 చదరపు గజాల చొప్పున ఇళ్ల స్థలం త్వరలో కేటాయిస్తామని పేర్కొన్నారు. కార్యదర్శి కుమారస్వామి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

దాశరథికి ఘన నివాళి



కేసముద్రం: కేసముద్రంవిలేజ్‌లోని శ్రీవివేకవర్ధినీ హైస్కూల్‌లో దాశరథి జయంతి కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. దాశరథి చిత్రపటానికి పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతంగౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు.

ఎస్సైకి సన్మానం

దంతాలపల్లి: మండలానికి నూతనంగా నియమితులైన ఎస్సై సీహెచ్ రమేష్‌బాబు ను కాంగ్రెస్ నాయకులు శనివారం సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భట్టునాయక్, రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం కార్యదర్శి సతీష్, ఎంపీటీసీ యాకయ్య, రామిరెడ్డి పాల్గొన్నారు.

విలీన గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టాలి

నెహ్రూసెంటర్: పట్టణంలోని విలీన గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుర్ర మహేష్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో చింతల బిక్షపతి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వ్యవసాయ కూలీలకు కూలి రేట్లు పెంచి ఇవ్వాలన్నారు.

బీజేపీలో చేరిక

దంతాలపల్లి: మండలం తూర్పుతండా గ్రామ పంచాయతీకి చెందిన బానోత్ ప్రభాస్‌నాయక్ శనివారం హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు.

మండల ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి



తొర్రూరు: టీయూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శిగా మోతె శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు సంఘం జిల్లా అధ్యక్షుడు కిషన్‌నాయక్ ప్రకటించారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన యాకయ్య అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాగా శనివారం బీసీ కాలనీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థికసాయం చేశారు.

నెల్లికుదురు: మండలంలోని శ్రీరామగిరి గ్రామంలో ఇటీవలే తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన పిల్లలకు సింగారం గ్రామానికి చెందిన ఎన్నారై కొత్త మురళీధర్‌రెడ్డి అదే గ్రామానికి చెందిన మణిదీప్‌తో పంపించిన రూ.10వేలను అందించాడు.

పీరీల సందడి

డోర్నకల్: మొహరం పండుగ సందర్భంగా గ్రామాల్లో పీరీలు సందడి చేస్తున్నాయి. డోర్నకల్ గాంధీ సెంటర్‌లోని అషుర్‌కానాలో పీరీలను ఎత్తుకొని ఊరేగించారు.

విజయవంతం చేయండి

కేసముద్రం: హైదరాబాద్‌లో వచ్చే ఆగస్టులో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జ్ బిర్రు మహేందర్ శనివారం తెలిపాడు.

రైతుబంధు నిధులు విడుదల చేయాలి

గంగారం: పోడు పట్టాదారులకు రైతుబంధు నిధులు విడుదల చేయాలి ఎంపీపీ సరోజన జగ్గారావు అన్నారు. మండల కేంద్రంలో ఎంపీపీ మాట్లాడుతూ.. రైతులకు రైతుబంధు పడకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తోందన్నారు. తక్షణమే ఆ నిధులను ప్రభుత్వం విడుదల చేయాలన్నారు.

హత్యను నిరసిస్తూ ర్యాలీ

గార్ల: కర్ణాటక రాష్ట్రంలోని బెల్గామ్ గ్రామంలో గల జైన్‌ల ఆశ్రమంలో ఉంటున్న జైనులు గురువు దిగంబరస్వామిని గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేయడాన్ని నిరసిస్తూ శనివారం గార్లలో నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జైన్‌లు మహవీర్, వినోద్, పదం, ప్రవీణ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రూ.50వేల విరాళం


మరిపెడ రూరల్: మండలంలోని చింతలగడ్డ తండా గ్రామ పంచాయతీ పరిధిలో ఇటీవల బొడ్రాయి, ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ డోర్నకల్ నియోజక వర్గ నాయకులు మాలోతు నెహ్రూనాయక్ రూ.50వేలు విరాళాన్ని తన అనుచరుల ద్వారా శనివారం తండా పెద్దలకు అంజేశారు. కార్యక్రమంలో నాయకులు రత్నాకర్‌రెడ్డి, దశరథ, కమిలి, సోమన్న పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని శ్రీవేణుగోపాల స్వామివారి దేవాలయంలో శనివారం కిసాన్ పరివార్ సంస్థ ఆధ్వర్యంలో 27 నక్షత్రాలకు పూజా కార్యక్రమం, నృత్య ప్రదర్శన, కోలాటం తోపాటు 27 నక్షత్రాలకు సంబంధించిన మొక్కలు నాటారు. ముఖ్యఅతిథిగా కిసాన్ పరివార్ ఫౌండర్ నానావత్ భూపాల్ నాయక్, ఈస్ట సొసైటీ వ్యవస్థాపకులు అచ్యుత్ రావు హాజరై మాట్లాడారు.

బీఆర్‌టీయూలో చేరిన అంగన్‌వాడీలు



బయ్యారం: మండలంలోని నాలుగు సెక్టార్లకు చెందిన అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ శనివారం సీఐటీయూలో నుంచి బీఆర్‌టీయూలో చేరారు. జిల్లా అధ్యక్షురాలు సులోచన మాట్లాడారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా సరోజ, కార్యదర్శిగా విజయలలిత, సహాయ కార్యదర్శి ధనలక్ష్మి, ఉపాధ్యక్షురాలు ఉపేంద్ర, కోశాధికారిగా సరితలను ఎన్నుకున్నారు.

'పాలేరు' ఘటనకు ఏడాది

- నాటు వేసేందుకు వెళ్లి వాగులో చిక్కుకున్న 21 మంది కూలీలు
- 16గంటల పాటు నిరీక్షణ
- సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు

మరిపెడ రూరల్: మరిపెడ మండలం తానంచర్ల రెవెన్యూ పరిధిలోని కోట్యాతండా, వాల్యతండా గ్రామ పంచాయతీల పరిధిలోని చౌళ్లతండాకు చెందిన 17 మంది, వాల్యతండాకు చెందిన 4గురు మొత్తం 21 మంది కూలీలు గత ఏడాది జూలై 22న పక్కనే ఉన్న సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం ముకుందాపురం గ్రామానికి వరి నాటు వేయడానికి ఆటోలో వెళ్లారు. అక్కడ పాలేరు వాగు రెండు పాయలుగా చీలిపోగా మధ్యలో ఎత్తుగా ఉన్న గడ్డపై రైతు వ్యవసాయ భూమి కలిగి ఉంది. ఉదయం నాటు వేయడానికి వెళ్లినప్పుడు మాములుగానే ఉండగా మోకాళ్ల లోతు వాగులో నుంచి వెళ్లి పొలంలో నాటు వేశారు. మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో నాటు వేయడం పూర్తై తిరుగు వస్తుండగా పాలేరు వాగు ఎగువ ప్రాంతంలో పడిన వర్షానికి వరద ఉధృతి చోటు చేసుకుంది. ఈక్రమంలో కూలీలు వాగు మధ్యలోని వ్యవసాయ క్షేత్రంలో ఉండిపోయారు. నాయకులు బాలాజీ, రవీందర్‌నాయక్‌లు డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, కలెక్టర్, ఎస్పీ, మరిపెడ రెవెన్యూ, పోలీస్ అధికారులకు సమాచారం అందించారు. అప్పటికే రాత్రి కావడంతో అధికారులు వాగు ఒడ్డున ఉండిపోయారు. డ్రోన్ ద్వారా కూలీలకు అధికారులు ఆహారాన్ని అందజేసి ధైర్యం చెప్పారు. అధికారుల ద్వారా విషయం తెలుసుకున్న మంత్రి సత్యవతిరాథోడ్ భద్రాచలం ఎన్డీఆర్‌ఎఫ్ బృందాన్ని అప్రమత్తం చేసింది. రాత్రి రెండు గంటలకు వాగు వద్దకు చేరుకున్న ఎన్డీఆర్‌ఎఫ్ బృందం అక్కడే ఉండి జూలై 23న ఉదయం డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్, కలెక్టర్ శశాంక ఆధ్వర్యంలో కూలీలను బోట్ ద్వారా ఒడ్డుకు చేర్చారు. ఎలాంటి హానీ చోటుచేసుకోకుండా సురక్షితంగా కూలీలు ఒడ్డుకు చేరడంతో ఇటు అధికార యంత్రాంగం, అటు బాధిత కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన జరిగి ఏడాది కావడంతో ఇంకా అప్పుడు జరిగిన భయానక వాతావరణం గుర్తుకు వస్తుందని కూలీలు చెప్పుతున్నారు.



సురక్షితంగా ఒడ్డుకు చేరిన కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక, ఎమ్మెల్యే రెడ్యానాయక్ (ఫైల్)

గుర్తుకు వస్తేనే భయమేస్తుంది..



పాలేరు వాగు మధ్యలో రాత్రంతా కారు చీకట్లో ఉండిపోయాం. అధికారులు ధైర్యం చెప్పినప్పటికీ భయం వేసింది. తాగేందుకు నీళ్లు కూడా లేవు. రాత్రి మొత్తం బురదలో నిలబడే ఉన్నాం. అయినప్పటికీ అధికారులు తమను రక్షించారు. ఆ ఘటన గుర్తుకు వస్తేనే భయమేస్తుంది.

- తేజావత్ దేవి, బాధితురాలు, చౌళ్లతండా, మరిపెడ

బస్టాండ్ నివాసమైంది..!



డోర్నకల్: స్థానిక బైపాస్ రోడ్డులోని ఆర్టీసీ బస్టాండ్ కూలీలకు నివాసంగా మారింది. మహబూబాబాద్, ఖమ్మం, ఇల్లెందు తదితర ప్రాంతాలను డోర్నకల్ మీదుగా నడిచే ఆర్టీసీ బస్సులు ఊరి మధ్య నుంచి వెళ్తుండటంతో ప్రయాణికులు ఆర్టీసీ బస్టాండ్‌కు రావడం లేదు. తరచూ అధికారులు బస్టాండ్‌ను పరిశీలించి వినియోగంలోకి తెస్తామని హామీ ఇస్తున్నా నేటికీ బస్టాండ్‌కు బస్సులు రావడం లేదు. ఇటీవల బస్టాండ్ ప్రక్కన రూ.2 కోట్ల నిధులతో ధోబీఘాట్ పనులు ప్రారంభమయ్యాయి. పనుల్లో పాల్గొంటున్న కూలీలు బస్టాండ్‌ను నివాస ప్రాంతంగా మార్చుకున్నారు. బస్టాండ్‌లోని దుకాణాన్ని వంటగదిగా మార్చి ఇక్కడే నివాసం ఉంటున్నారు.